



విజయవాడనుండి కడపకు బదిలీ అయింది నాకు. మా డిపార్టుమెంటు జిల్లాల జిల్లాలకే బదిలీ చేస్తుంటారు. మన రాష్ట్రానికి ఇంకా ముప్పయి జిల్లాలు లేవు. ఉత్తరోత్తరా ఏర్పడతాయేమో అన్నా అతిశయోక్తి కాదు. అయితే ముప్పయ్యేళ్ళ సర్వీసులోనూ ముప్పయి జిల్లా కేంద్రాలకు మావాళ్ళు మార్చేస్తారనడం మాత్రం అతిశయోక్తి కాదు.

అయితే ముప్పయ్యేళ్ళు కూడా ఒకే వూళ్ళో ఉంటూ బదిలీ బకాసురుడి నోటపడకుండా వాళ్ళను కాకాలు పట్టి, బాకాలు వూదే విశాలవాక్కులు లేక పోలేదు మాలో.... ఆ మాట కొస్తే కాకాలు పట్టడం కూడా గొప్ప కళ. తన ఆకర్షణతో, ఆర్భాటంతో పై అధికార్లను వశపరచుకొని పబ్బం గడుపు కొన్నారు వాళ్ళు.

నేనూ బాగా ఎత్తు, లావు ఆకర్షణ కలిగి ఉన్నా ఒట్టి అమాయకుణ్ణి. మొహమాటస్తుణ్ణి. ఏ జిల్లాకు వేస్తే ఆ జిల్లా కేంద్రం వెదుక్కుంటూ వెళ్ళడం తప్ప ప్రాప్తకాలజ్ఞత బొత్తిగా లేనివాణ్ణి.

అంతేకాదు నా సొంత వూరు. పదేళ్ళ కిందట కడపకు వేయించుకోవాలని ఎంతమంది అధికారు లొస్తే అంతమందితో చెప్పుకొన్నాను. అందరూ చూద్దాం, చేద్దాం అన్నవారేగానీ తీరా సమయం వొచ్చేసరికి మంచి ఉపాయస్తు డెవరో ఆ అవకాశం కాజేసి నావైపు హేళనగా చూస్తూ వెళ్ళిపోయే వారు. ఇప్పుడిహ కడపకు వెళ్ళ ప్రయోజనం లేదు. ఎందుకంటే అక్కడ మా పూర్వపు ఆస్తిపాస్తులు, బంధువులు ఎవరూ లేరు. ఉన్నవాటిని మా సోదరులు అమ్మేసి వాళ్ళు కూడా నన్ను హేళనగా చూస్తూ రాజధాని నగరంలో స్థిరపడ్డారు. పుట్టి పెరిగిన వూరయినా ఇప్పుడు మొహాలు వెదుక్కోక తప్పదు.

కడపలో దిగగానే అంతా కొత్తగా తోచింది. అయితే చంద్రం కనిపించి కాస్త ఊరట కల్పించాడు. ఎంతో ఆప్యాయతతో హోటల్లో దిగుతానన్నా వినకుండ వాళ్ళింటికి తీసుకుపోయాడు. వాడికి ఇద్దరు ఆడపిల్లలు. ఇద్దరూ డిగ్రీ చదువులు చదువుతున్నారు. వాడి సతీమణి పార్వతి రచయిత్రి ఏవో కథలు, నవలలు, రేడియో నాటికలు వ్రాసి గుర్తింపు తెచ్చుకొంటున్న వ్యక్తి. చంద్రం ఎంత నా బాల్యమిత్రుడయినా ఆవిడగారు నన్ను అట్టే విపరీతంగా గౌరవించలేదు. కాదంటే భర్త ఒత్తిడంతో తప్పనిసరై ఆప్యాయతను చూపింది.


పిల్లలూ అంతే—అడిగిన ప్రశ్నలకు అడిగిన మేరకే నవ్వుతూ జవాబిచ్చారు, తప్పుకొన్నారు. పార్వతిగారి రచనల్ని గురించి ప్రస్తావించినా ఏదో రాసేస్తున్నా నన్నదే కాని ఆసక్తి ఎక్కువ చూపలేదు. నేనూ రచయితనే. కానీ ప్రచురణ అయ్యేవాటికన్నా తిరుగుమొహం పట్టేవే ఎక్కువ కావడంతో ఎన్ని

ఏళ్ళుగా రాస్తున్నా చెప్పుకోలేకపోతున్నాను. ఇంద్రవే: నా రచనలు, రేడియో నాటికలు చూచానని, ఎంతో గొప్పగా ఉన్నాయని ప్రశంసించి, నా పార్వతిగారు "ఆహా, అల్లాగా! ఏ కథ? ఎక్కడ?..ఎప్పుడు...? నే వినలేదే" అనడంతో మాయమవుతున్న నా మొహంలోని నవ్వును కష్టపడుతూ నిలుపుకోవాల్సి వచ్చింది.

సరే అయితే ఎన్నాళ్ళు. నా ఆవిడ, పిల్లలు కూడా మరో మూడు నెలల్లో వచ్చెయ్యొచ్చు... పిల్లల చదువుల కొక్కటే ఇబ్బంది. ఈలోగా ఒక ఇల్లు తీసుకొంటే సరిపోతుంది అనుకొన్నాను.

## 2

ఇవన్నీ ఎట్లా ఉన్నా ఆఫీసులో చేరేసరికి ఆనంద పరిచిన అంశాలు రెండు. మొదటిది—నా అధికారి పెద్దమనిషి, మంచివాడు. రెండోది—ఈ ఆఫీసులో పని ఎక్కువ లేకపోవడం. ఆఫీసరు




నెల ముక్కాలు భాగం క్యాంపుల్లో ఉండిపోతుంటారు. వెయ్యాలసిన మరొక అధికారిని, ఒక గుమాస్తాను చాలా నెలలుగా ఇక్కడ పనెక్కువ లేని కారణంగా వెయ్యలేదు. ఇద్దరు అటెండర్లలో ఒకతను సెలవులో ఉండిపోయాడు మరొకతను నాగరాజు. అతను ఈ జిల్లావాడు. చాలా ఏళ్ళుగా బదిలీలు లేకుండా ఇదే ఆఫీసులోనే ఉంటున్నవాడు. ఇక ఆఫీసు చూసుకోవలసింది పై కారణాలవల్ల నేనొక్కడినే. నేను రావడం, జాయిన్ కావడం నా ప్రక్క ఆఫీసువాళ్ళకు ఎంతో సంతోష మైంది. నన్నెంతో గౌరవించారు. అక్కడి అటెండర్లు నాకు వందనాలు పెట్టడం, ఆప్యాయతతో పలుకరించడం నా కెంతో గౌరవ హోదాల్ని కల్పించింది.

అయితే నాగరాజు మాత్రం అందుకు భిన్నంగా అగుపించాడు మొదట. నువ్వెన్నాళ్ళుంటావులే ఇక్కడ అన్న దృష్టితో చూచాడు. అయితే అతడు కూడా నన్ను గౌరవించకపోలేదు. మంచీ చెడ్డా విచారించక పోలేదు. కానీ తను ఒక తిరుగులేని వ్యక్తిత్వపు భాగం అతడిలో కొట్టవచ్చినట్లు కనిపించేది.

మా కార్యాలయానికి ఒక పనిమనిషి అంటూ ఇంకా శాంక్షన్ కాలేదు. ఎదురుగా ఉన్న పాకలో రిక్షా జీవనం గడిపే రంగన్న భార్య రాజమ్మ పాతిక రూపాయలకు కుదిరి కసవు తోసి, నీళ్ళు తెచ్చి పెట్టేది. పిల్లల తల్లి. ఒక కూతురికి ఇటీవలే పెళ్ళి చేసిందట. రంగన్న సంపాదన కుటుంబానికి సరిపోక కొన్ని ఇళ్ళలో పాత్రలు తోమడం, నీళ్ళు పట్టడం చేస్తూ మా కార్యాలయంలో కూడా కుదిరింది.

నేను చంద్రం ఇంటినుండి విడుదలై వేరొక ఇల్లు తీసుకొన్నాను. మా ఇంటిలో కూడా రాజమ్మ కసవు తోస్తూ నీళ్ళు తెచ్చిపెట్టే ఏర్పాట్లు మాట్లాడుకొన్నాను. మా కుటుంబం రావడానికి పిల్లల పరీక్షలు కావాలి. అయినా ఇళ్ళు దొరకడం కడపలో గొప్పవరం పొందినట్లు కావడం వల్ల దొరికిన ఇంటిని తీసుకొన్నాను. రాజమ్మను చూస్తే పిల్లల తల్లి అనిపించదు. అందగత్తె కాకపోయినా ఆగయిన సౌష్ఠవంతో నాజూకుగా, ఆరోగ్యంగా నవ్వుతూ తిరుగుతూండేది. చాలా ఏళ్ళు కడపకు దూరంకాబట్టి స్వస్థలం కాబట్టి రాజమ్మ మాటల్లోని కడప యాస నాకెంతో సంతోషాన్ని కలిగిస్తుండేది.

"అమ్మయ్యా రావటానికి చాలా రోజులు పడతాదేమోనే. నీకు చాలా కష్టంగుంటాది కదా, సామీ" అని నావైపు వోరకంటితో చిలిపిగాచూస్తూ అనేది. నా గుండె ధ్వని నాకు వినిపిస్తున్నా పేపర్ చూస్తూ "వూఁ!" అనేవాడ్ని...చలిస్తున్న మనసును అదుపు తప్పకుండా జాగ్రత్తపడేవాడ్ని. ఒక స్త్రీని ఆకర్షించే అందం, హుందాతనం నా కున్నందుకు గర్వించుకునేవాడ్ని. అయినా నా ఆవిడ తప్ప పర స్త్రీ పొందు కోలేని ఒట్టి అర్భకుణ్ణి! పెద్ద పెద్ద కడవలు భుజాని కెత్తుకొని శ్రమపడేది రాజమ్మ. ఆమె తినేది రోజుకు రెండు పూటల సంకటి. అందులోకి ఉల్లిపాయ కారం. అంతే తప్ప విగాకి ఇంత మజ్జిగ మొహం కూడా చూసేదికాదు. ఏ నెల కొకసారో మాంసం, కోడిగుడ్ల ఆమ్లెట్లు లాంటివి తినేవారు వాళ్ళు. మరి వాళ్ళ కుటుంబం అందరూ ఎంతో ఆరోగ్యభాగ్యంతో మెరుస్తూ కనిపించేవారు.

మరి మా కుటుంబంలో ఎప్పుడూ పాలు, పెరుగు, వెన్న, చక్కని నెల్లూరు పిఠాణాల బియ్యం, పళ్ళు, తాజా కూరగాయలు ఎని ఆరగిస్తున్నా వూఁ హూఁ....ప్రయోజనం లేదు. నా ఆవిడకు బి. పి. మా పెద్దమ్మాయికి ఎప్పుడూ ఘోరమైన తల నొప్పి, మా కాలేజీ చదివే ఘనుడికి ఇంతేసి లావు సోడాబుడ్డి కళ్ళద్దాలు. ఏడేళ్ళొస్తున్నా మూడేళ్ళ పిల్లలా కన్పించే మా చివరి పిల్లకు గొంతులో టాన్సిల్స్...డాక్టర్ బిల్లు ప్రతి నెలా మాటే? ఆ వైపేగాని ఈ వైపుకి తగ్గదు. రాజమ్మను చూసే మా కుటుంబాన్ని పోల్చుకొని బాధకలుగుతుంది. ఇంకెందుకు గొప్పలు చెప్పుకోడం?

"ఈ నీళ్ళు మోస్తావుంటే ఇయ్యన్నీ నొప్పులు, సామీ" అని జాలిగా, బాధగా నా కళ్ళలోకి చూస్తూ తన రోనమ్మ చూపేది రాజమ్మ.

మళ్ళీ నా గుండె చప్పుడవుతూ—"డాక్టర్ దగ్గర కెళ్ళగూడదా" అనేవాణ్ణి.

"తినడానికే సాలకుండా ఉంటే డాక్టర్ల కేడ మేపగలంటావు."

నే నా మాటకు పశ్చాత్తాపపడేవాణ్ణి. ఒకసారి ఇలాగే చెబితే ఒక పది కాగితాన్ని తీసి ఇస్తూ "డాక్టర్ దగ్గరకు వెళ్ళు" అన్నాను.

అందుకు నవ్వేస్తూ "వద్దు సామీ... నీ బాకీ ఎట్లా తీర్చుకొనేది" అన్నది.

"బాగా వద్దు. వూరికే తీసుకో" అన్నాను.

"వద్దు, సామీ...అదే తగ్గుతదిలే" అంటూ గబుక్కున చూసి కిలుక్కున నవ్వేసి కడవతో పారిపోయింది.

మొదటిసారి రాజమ్మను చూసినప్పుడు నాకు అనే పిలుస్తున్నాను. నేనలా పిలవడం తనకు సోదరభావం కలిగింది. పిలవాల్సొస్తే 'ఏమమ్మా' బాదేమో అతి కష్టంగా మొహంలోకి వినయం' తెచ్చుకొని తల వంచుకునేది.

## 3

మా చిన్నపిల్లకు టాన్సిల్స్ వాపు జ్వరంతో బాధపడుతూందని ఉత్తరం రాగానే ఒక అయిదు రోజులు కలిసొచ్చేలా విజయవాడకు వెళ్ళాను. నేను వచ్చేటప్పటికి ఆఫీసులో అసలు కథ ప్రారంభ మైంది.

"స్వీపర్ రావడం లేదు—రెండు రోజులైంది" అన్నాడు నాగరాజు.

"ఏం? ఎందుకూ?" అన్నాను.

"కసుపూడ్చేదానికి అంత గర్వమా.....కసువు సరిగా పూడ్చు అన్నందానికి ఎగిరిపడింది. తిట్టింది మను! అందుకే ఆఫీసర్‌గారు కూడా రాజమ్మను

మానుకోనున్నాడు'' అన్నాను.

ఆఫీసర్ పూర్తిగా లేను. క్యాంపు వెళ్ళారు.

''కనువు తోసే వ్యక్తి అయినంతమాత్రాన ఎవరి గౌరవ మర్యాదలు వారి కుంటాయి. ముత్యాన్ని అనకుండా ఉండాలసింది'' అన్నాను.

''మీరేంది దాన్ని సపోర్టు చేస్తున్నారే!'' అన్నాడతను. వారిద్దరి మధ్య పెద్ద ఘర్షణే జరిగినట్లుంది.

''వేరే పనిమనిషిని పెట్టండి అన్నారు ఆఫీసర్ కూడా. సరేనని మరొకర్ని కుదిర్చాను. ఆమె సరిగా రాకపోవడం, మానుకోవడం జరిగింది. మరొకర్ని కుదిర్చాను...ఆమె కూడా డుమ్మా అన్నది.''

''వేసవికాలం. తాగడానికి నీళ్ళు లేకపోతే చాలా ఇబ్బందిగా ఉంది'' అని ఆఫీసర్‌తో అన్నాను.

''పోనీ పాత స్వీపర్నే రమ్మనండి. ఆమె అయితే సక్రమంగా పనిచేస్తుంది'' అన్నారు.

సరేనని రాజమ్మనే మళ్ళీ పిలిస్తే—

''మీ ఇంటికయితే నా అభ్యంతరం లేదు బాబూ. ఆఫీసులో మరొకర్ని చూసుకోండి'' అన్నది.

''వద్దమ్మా. నువ్వే పోస్తుండు. పాతిక రూపాయలెందుకు పోగొట్టుకుంటావు'' అని నచ్చజెప్పితే మళ్ళీ రావడం మొదలెట్టింది.

దానితో నాగరాజు అన్నీ నీళ్ళు వదిలేశానన్నాడు.'' ఈ స్వీపరు మన ఆఫీసులో చెయ్యడానికి ఎంతమాత్రం వీల్లేదు'' అన్నాడు.

''ఆమె తెచ్చిన నీళ్ళు నేను ముట్టుకోడం లేదు'' అన్నాడు.

''ఆమెలో ఏ తప్పూలేదు. సక్రమంగా పని చేస్తూందికదా'' అన్నాను.

నాగరాజు వినడం లేదు. ''ఎలాగయినా రాజమ్మని తీసెయ్యాల్సి—లేకుంటే యూనియన్‌కు రిపోర్ట్ చేస్తాను'' అన్నాడు.

''ఎందుకు నాగరాజా. ఏదో పేదరాలు. ఆమె నోటికాడు తియ్యడమెందుకు'' అన్నాను. వినలేదతడు. యూనియన్‌వాళ్ళు ''ఇలాంటి చిన్న విషయాల్లో మేము జోక్యం చేసుకోము'' అన్నారు.

ఇంటి దగ్గరికొచ్చి రంగన్న చేతులు జోడిస్తూ ''మా రాజి చేసిన తప్పేమిటి, దొరా. పేదోళ్ళం—దయచేసి మా కన్యాయం చెయ్యకండి'' అన్నాడు.

నాకు పట్టుదల పెట్టింది. ''రాజమ్మే ఉండాలి'' అన్నాను. మా అధికారి కూడా అలాగే అన్నాడు.

దానితో నాగరాజు అహం దెబ్బ తిన్నది. మళ్ళీ యూనియన్‌వాళ్ళను కదిపారు. యూనియన్ నాయకులు ''చూస్తాను, ఈ నెల రోజులు వెళ్ళనీ'' అన్నారు. నాగరాజు వినలేదు. ఈ స్వీపర్ చెయ్యడానికి వీల్లేదన్నాడు.

''పేదవాళ్ళ జోలికి మనం పోరాదు. ఆమె, రంగన్న ఎన్ని కష్టాలు పడో బతుకుతున్నారు'' అన్నాను.

''అది కనువు తోసి బతికే మనిషండి. దాని కెంత పొగరు. నన్ను ఎట్లా మాట్లాడిందో మీకేం తెలుసు... అసలు మీ రెందుకు దాన్ని సపోర్ట్ చేస్తున్నారు?''


నేను కోపం తెచ్చుకొని ''ఒక వ్యక్తి పేదరాలు అయినంతమాత్రాన అట్లా 'అదీ', 'ఇదీ' అని మాట్లాడకు ... జాగ్రత్త, నీ హద్దుల్లో నువ్వుండు'' అన్నాను.

''అసలు దాన్నెందుకు వెనకేసుకొస్తున్నారు? దానికీ, మీకూ మధ్య జరిగే తతంగం ఈ ఊరందరికీ తెలుసు...'' అన్నాడతను.

అందుకు నేను చెంపలు పెట్టి ''అట్లా తప్పుడు అపవాదాలు వెయ్యవద్దు'' అని దండించాను. అప్పటికి ఊరుకున్నాడు నాగరాజు.

## 4

ఒక రోజు చంద్రాన్ని చూద్దామని వాళ్ళింటికెళ్ళాను. అతడి భార్య తలుపు తీసి నిల్చొని ''ఆయనగారు ఇంట్లో లేరండీ'' అన్నది అదో విధంగా నావైపు చూడడానికి ఏవగింపుతో. మా చంద్రం కూతుళ్ళు కూడా నన్ను శత్రువు చూసినట్లు చూసి మొహం తిప్పుకున్నారు. నేను ఆశ్చర్యపోయాను.




ఆదివారం — ఎలక్ట్రిసిటీ సబ్—స్టేషన్‌లో నా మిత్రుడు మూర్తి ఇంజనీర్‌గా ఉంటే ఆయన్ను చూడ్డానికి వెళ్ళాను.

''ఏమిట్రా, నారాయణా ఈమధ్య మన్మథుడైపోయావట. ఎవతో ప్రియురాలితో కథ మంచి రసకందాయంలో నడిపిస్తున్నావట'' అన్నాడు. నాకు తల తిరిగిపోయింది—

''నా జీవితంలో పర స్త్రీ పొందు ఎరుగనే. ఏ ద్రోహి చెప్పాడు నీ కివన్నీ'' అన్నాను.

మూర్తి నవ్వి ''తిట్టకు. ఏదో ఉన్నా ఫర్వాలేదులే. అలాగ్గా రెండు కాడతావు. పల్లెగ్గా ఇల్లు తీసుకొని ఇంట్లో పగటిపూటే వ్యవహారం సాగిస్తున్నావట'' అన్నాడు.

నాకు తెలిసిన ప్రతి వ్యక్తీ నన్ను ఆదోవిధంగా చూడడం, చిన్న నవ్వు నవ్వడం ప్రారంభించారని మూర్తి మాటలు విన్నాక ఒక్కొక్కటే గుర్తొచ్చింది.

''ఏమిటి? నువ్వూ నమ్మావా,మూర్తీ. నేనెలాంటి వాడ్నో తెలీదా నీకు'' అన్నాను తీక్షణంగా.

మూర్తి నవ్వి నా భుజం తడుతూ—''రసికత్వం అనేది ఉండాలి, బ్రదర్. తప్పులేదు'' అన్నాడు.

దీని కంతకూ కారణం ఎవరైందీ ఇప్పుడు' స్పష్టంగా తెలిసొచ్చింది. రాజమ్మను తీసెయ్యలేదని నాగరాజు నామీద చేసిన దుష్ప్రచార మిది. అతణ్ణి బాగా దేహశుద్ధి చెయ్యాలని కుతకుతలాడిపోయాను. కానీ అత ద్దేం చేసినా నా పై బడ్డ అప్రతిష్ఠ మరింత గట్టిపడుతుందే తప్ప నిజం తెలిసిరాదు ఎవ్వరికీ. నాగరాజు ఎంత నీచానికైనా దిగజారే వ్యక్తి అని బాగా తెలిసింది.

మా ఆఫీసర్ ఇంటికి వెళ్ళి ఆతడు చేసిన దుష్ప్రచారాన్ని గూర్చి చెప్పుకున్నాను. యూనియన్ సెక్రటరీ కనిపిస్తే మొరపెట్టుకున్నాను. అతడు కూడా నన్ను ఆదోలా చూసి, ''నిప్పులేనిదే పొగ వస్తుందా, నారాయణగారూ: ఇంతకూ రసికాగ్రేసరులే మీరు'' అన్నాడు.

ఏం చెప్పుకోను? చివరికి అధికారితో చెప్పనే చెప్పాను.

అందుకు ఆయన నవ్వి—''ఈ కాలంలో ఆడుండర్లే పరిపాలకులు. మన ఆఫీసర్లమైనా ఉండి కూడా ప్రయోజనం శూన్యం. మాటకొస్తే యూనియన్‌ను మూవ్ చేస్తే, మనం వాళ్ళు చెప్పినట్లు వినాల్సిందే'' అన్నారు.

ఆఫీసర్ కూడా అలా అనేసరికి నాకు బాధ కల్గింది. మరునాడు ''రాజమ్మను నేటినుండి రావద్దని ఆఫీసర్ చెప్పాడని చెప్పు'' అన్నాను. ఆగిపోయింది రాజమ్మ.

సాయంత్రం నేను పేపర్ చదువుతూంటే కసువు తొయ్యడానికని వచ్చింది రాజమ్మ. నేను పేపర్‌లో మొహం పెట్టుకొని ''మా ఇంటికి కూడా రావద్దు, రాజమ్మా'' అన్నాను.

ఆవిడ ఆశ్చర్యపోతూ—''ఎందుకు, పోమీ. నేనేం తప్పు చేసిందాను?'' అన్నది.

''ఒద్దమ్మా, ఏదో నేను మంచిగా ఉంటే నీకూ నాకూ కూడా రంకు తగిలించారు. దయచేసి మానుకో'' అన్నాను.

రాజమ్మ శిలాప్రతిమలా చాలాసేపు నిశ్శబ్దంగా కన్నీరు కారుస్తూ అలా నిల్చుండిపోయింది. *